పేద విద్యార్థులకు వరం

- తొలి రోజే జగనన్న విద్యాకానుక పంపిణీ
- పాఠశాలల వద్ద తల్లిదండ్రులతో కోలాహలం
- విద్యార్థుల్లో తల్లిదండ్రుల్లో సంతోషం



దగదర్తిలో విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక'లను అందజేసిన ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు

కావలి: బడి తెరుస్తున్నారంటే తల్లిదండ్రులకు దడ. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించాలంటే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, జతల యూనిఫాం, పలు రకాల సామగ్రి కొనాల్సి ఉండేది. చేతిలో ఉన్న నగదు అయిపోవడంతో కుటుంబ జరుగుబాటుకు కొద్ది రోజులు ఇబ్బందులు పడే పరిస్థితి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి చేతిలో చిల్లి గవ్వలేని పేదల కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు డబ్బుల్లేవు.. బడికి ఇప్పుడే వద్దులే అని వాయిదా వేసి పిల్లలను బడికి పంపించే వారు కాదు. ఇప్పుడా ఆ బెంగ తీరింది. స్కూల్ తెరిచిన రోజే ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన విద్యాకానుక కిట్లను అందించడంతో తొలి రోజే ఫుల్ హాజరుతో ప్రభుత్వ బడులు కళకళలాడుతున్నాయి. కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలు, దగదర్తి, అల్లూరు, బోగోలు, కావలి మండలాల్లోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కింద అన్నీ రకాల విద్యా ఉపకరణాలు అందించారు.

కిట్లలో ఏముంటాయంటే..

జగనన్న విద్యాకానుక కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫాం క్లాత్ (కుట్టు కూలీతో సహా), ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6–10 తరగతి పిల్లలకు), పిక్టోరియల్ డిక్షనరీ (1–5 తరగతి పిల్లలకు)తో కూడిన కిట్లను విద్యార్థులకు అందజేస్తున్నారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు

ప్రస్తుతం 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కిట్లను ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో అందించారు. విద్యా కానుక కిట్ల ద్వారా అందించిన వస్తువుల్లో ఏవైనా లోపాలుంటే వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని, వారం రోజుల్లో వేరే అందజేస్తారు ఫిర్యాదులు ఏమైనా ఉంటే 14417 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.

ఈనెల 30 వరకు పాత యూనిఫాంకు అనుమతి

జగనన్న విద్యా కానుకలో భాగంగా ఈ ఏడాది కొత్త డిజైన్లో యూనిఫాం క్లాత్ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు కొత్త వస్త్రాలతో యూనిఫాం కుట్టించుకునే వరకు పాత యూనిఫాం ధరించి పాఠశాలకు రావొచ్చని చెప్పారు. ఈ నెల 30 వరకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఆ లోగా కొత్త యూనిఫాం కుట్టించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 17వ తేదీ వరకు ఒంటి పూట బడులను నిర్వహించనున్నారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నిర్వహిస్తారు.

విద్యాకానుక కిట్లు అందజేత

సంగం: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. మొదటి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది. మండలంలో మొత్తం 57 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 4,654 మంది విద్యార్థులు ఉన్నారు. తొలి రోజు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో 1700 మంది విద్యార్థులకు జగనన్న విద్యానుక కిట్లును అందజేశారు.

అల్లూరులో..

అల్లూరు: ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల నేత నీలం సాయికుమార్ అన్నారు. సోమవారం స్థానిక రామకృష్ణా జూనియర్ కళాశాల, సుబ్బయ్య బడిలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 4,732 మంది పిల్లలకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్ది, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ వి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గంగిరెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు ఉస్మాన్ షరీఫ్, మేడా శ్రీనివాసులరెడ్డి, తాండ్ర మల్లి, బత్తల సుధ, షేక్ రసూల్ పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుకను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాపిశెట్టి నర్సింహులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పలువురు తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్‌లు పంపిణీ

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే సదుద్దేశ్యంతో ఎన్నో సంస్కరణలు చేపడుతున్నారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్పులొచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవంగల ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ దేవనబోయిన వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితే జగనన్న లక్ష్యం

చేజర్ల: విద్యార్థులతో పాటు రాష్ట్రంలోని అన్న వర్గాల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా చేజర్లలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేశారు. కార్యక్రమలో ఎంపీడీఓ కరిముల్లా, మండల కోఆప్షన్ సభ్యులు బషీర్, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ అల్లం స్వప్న, ప్రధానోపాధ్యాయురాలు హైమవతి, నాయకులు ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యం

వరికుంటపాడు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర అన్నారు. ఆయన సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదింటి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు, నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందించడం, విద్యా ఉపకరణాలు, తదితరాలు విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు దేవనబోయిన మధు, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి ఏపీఎం వైనారూత్ పాల్గొన్నారు.

జగనన్న చెప్పిందే చేస్తారు

అనుమసముద్రంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చేయడం ఆయన లక్ష్యమని ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీకొలను ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, షూస్, యూనిఫాం తదితర వాటిని విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం జగనన్న విద్యాకానుకలు అందిస్తోందని, ఇది వారికి వరంలాంటిదని ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేషాద్రివాసు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను ఎంఈఓ షేక్ నజీర్ బాషాతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లయ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరు వాటిని వినియోగించుకొని చదువుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు అందజేశారు. మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవ రెడ్డి, స్థానిక సర్పంచ్ టీబీజాన్, హెచ్‌ఎం పద్మావతి పాల్గొనగా, ఆత్మకూరు మండలం మహిమలూరులో ఎంఈఓ నజీర్‌బాషా, స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, హెచ్‌ఎం ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



సంజీవనగర్ పాఠశాల విద్యార్థులకు జేవీకే కిట్‌లను అందిస్తున్న హెచ్‌ఎం



విద్యాకానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం



విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



చేజర్ల: విద్యాకానుక పంపిణీ చేస్తున్న తూమాటి విజయభాస్కర్‌రెడ్డి



ఆత్మకూరు: ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు అందజేసిన దృశ్యం



విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి



బండారుపల్లిలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వరికుంటుపాడు: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ



కలిగిరి: జగనన్న విద్యాకానుక కిట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని సజ్జలకు వినతి



సజ్జలకు సమస్యను విన్నవిస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి: వైద్య ఆరోగ్య శాఖ, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో విధులు నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం అమరావతిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందించి విన్నవించారు. వారు మాట్లాడుతూ వేతనాల పెంపు, ఇంక్రిమెంట్ల మంజూరు, రెగ్యులరైజేషన్ విషయంలో తమకు అన్యాయం జరిగిందని, ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు విన్నవించారు.

వైభవంగా గంగాభవాని గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో అనంతపురి గంగాభవాని ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

చెన్నకేశవస్వామి గుడి నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరు: స్థానిక దళితవాడలో చెన్నకేశవస్వామి గుడి నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు గుడి నిర్మాణానికి దాతగా వ్యవహరిస్తున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

ఉదయగిరి: పట్టణంలోని ఎస్‌బీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు–నేడు పనులను సోమవారం ఎంఈఓ మస్తాన్‌వలి తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలో జరుగుతున్న కిచెన్ షెడ్డు, బాలికల మరుగుదొడ్ల నిర్మాణాలు, మేజర్, మైనర్ మరమ్మతులను పరిశీలించి కమిటీకి సూచనలందించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ మునావర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయుడు

కొండాపురం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గ్రంథాలయశాఖ అధికారి జె.కొండయ్య నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మర్రిగుంట ఉపాధ్యాయుడు గుర్రం మాల్యాద్రి అందించారు. గ్రంథాలయశాఖ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మేధస్సును పెంచేందుకు వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసిందన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లి మేరి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతుండడంతో జీఎంకే ట్రస్ట్ అధినేత, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి ఆమె కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మరింత ఆర్థిక సాయం చేస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఆర్డీఓ కరుణకుమారి



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్పందనలో అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు సమస్యలపై మండలాల నుంచి పది అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో అన్ని శాఖల కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అక్కడ అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆర్డీఓ కార్యాలయానికి సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా మండల అధికారులు ఆదేశాలు జారీ చేశామని ఆర్డీఓ కరుణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుభద్ర, సీడీపీఓ జైనకుమారి, హౌసింగ్ డీఈ నటరాజ్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా రక్తదాన ఉద్యమం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ వీరనారాయణ రెడ్డి

బిట్రగుంట: రక్తదానాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పీ వీరనారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 'టీం సేవియర్స్' ఆధ్వర్యంలో ఆర్ఎస్సార్ కళాశాలలో స్వచ్ఛంద రక్తదానం–సామాజిక బాధ్యత అనే అంశంపై సోమవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తమ కళాశాలలో రక్తదానం ఆవశ్యకతపై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగించేలా ఏడాదిలో మూడు సార్లు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి వేలాది యూనిట్ల రక్తాన్ని రక్తనిధి కేంద్రాలకు అందిస్తున్నట్లు వివరించారు. రక్తదానంపై ప్రజల్లో కూడా విస్తృతంగా అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో విద్యార్థులు చొరవ చూపాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ కుటుంబంలో, తమ గ్రామంలో రక్తదానంపై అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీం సేవియర్స్ సంస్థ అధ్యక్షులు ప్రణీత్, అధ్యాపకులు కృష్ణవేణి, లక్ష్మీ, షబానా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తొలి రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న పంచాయితీ కార్యదర్శి రాధాకుమారి

అల్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ చేపట్టిన సచివాలయ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొట్టమొదటిగా అల్లూరు సబ్‌రిజిస్ట్రారు పరిధిలోని విడవలూరు మండలం అలగానిపాడు సచివాలయంలో సోమవారం తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని సబ్‌రిజిస్ట్రారు ప్రసన్నలక్ష్మీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అందుకు అవసరమైన ఏర్పాట్లను ఈ ఏడాది ఏప్రిల్ 20న అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించారు. అయితే భూముల రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేశారు. భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి కావడంతో సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారని చెప్పారు. అల్లూరు మండలంలోని బీరంగుంట, గ్రద్దగుంట, విడవలూరు మండలంలోని అలగానిపాడు గ్రామాలకు చెందిన మూడు దస్తా వేజులను రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ మేరకు సోమవారం తొలి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌కు ఈ స్టాంపింగ్ వేసి అలగానిపాడుకు సచివాలయానికి చెందిన నీళ్ల జతీష్‌కుమార్‌కు కార్యదర్శి రాధాకుమారి అందజేశారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



రమణయ్య మృతదేహం

కావలి రూరల్: అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం కావలి శివాలయం రోడ్డులో వెలుగుచూసింది. 1వ పట్టణ ఎస్సై అంబేడ్కర్ సమాచారం మేరకు మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ పెద్దపట్టు గ్రామానికి చెందిన వాయిల రమణయ్య(45) సముద్రంలో వేట చేసుకోని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి శివాలయం రోడ్డు పక్కన పడిపోయాడు. గొంతు ఆరిపోయి చనిపోయారని ఉంటాడని పోలీసుల తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దేహదారుఢ్య పరీక్షలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: డాక్టర్ వైఎస్సార్ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 17న ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన, ఆసక్తిగల బాలబాలికలు తన జనన ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్లతో ఈ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు.

జగనన్న ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలి



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

సీతారామపురం: మండలంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు జగనన్న ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ అన్నారు. ఆయన మండలంలోని దేవమ్మచెరువులో సోమవారం జగనన్న ఇళ్ల స్థలాలను పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుడికి రూ.1.80 లక్షల నగదు, డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేలు రుణం, ఇసుక, మెటీరియల్ అందజేస్తుందన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకునేలా వలంటీర్లు నిత్యం అవగాహన కల్పిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లేఅవుట్‌లో ఇరిగేషన్ అధికారుల సర్వే



లేఅవుట్‌లో ఆక్రమిత కాలువ భూముల సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం–ఆత్మకూరు రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఓ లేఅవుట్‌లో వాగు పోరంబోకు, పారుదల కాలువ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించడంతో పలువురు ఫిర్యాదు మేరకు వాటిని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. గతంలో ఈ ఆక్రమణలపై ఫిర్యాదు రావడంతో ఇరిగేషన్ శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆక్రమిత కాలువ భూములను గుర్తించి ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి గుర్తించిన మేరకు ఖాళీ చేయాలని సూచించారు. తాజాగా ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దారు లక్ష్మీనరసింహం, డీటీ రాజేష్, ఆర్ఐ, సర్వేయర్లతో కలిసి ఆక్రమిత కాలువ భూములను మరో సారి సర్వే నిర్వహించి గుర్తింపు రాళ్ల నాటించారు. త్వరలో ఆ మేరకు ప్లాట్లను తొలగించనున్నట్లు ఆయన తెలిపారు.

జీజీఎంసీ నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందించి విన్నవిస్తున్న నాయకులు

ఉదయగిరి: నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామపురం మండలాలకు జీజీఎంసీ నిధులు మంజూరు చేయాలని సీతారామపురం మండల మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, గండిపాళెం మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి విన్నవించారు. వారు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే సజావుగా చేపట్టలేదన్నారు. దీంతో సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జీజీఎంసీ నిధులు సద్వినియోగం కాక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆ నిధులను పంచాయతీలకు కేటాయించి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని ఆయనకు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు ఇర్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని ఇర్లపాడులో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మేకపాటి కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యలపై అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.